
సాక్షి అనంతపురం

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.22,050

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,050 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.9°/16.3°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆదిదేవా.. శరణు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఆదిదేవుడు నరమృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామిని అర్చకులు విశేషంగా అలంకరించారు. నరమృగ వాహనం పై పురవీధుల్లో విహరిస్తున్న స్వామివారిని దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు.

మొక్కల పెంపకంతోనే ఇసుక దిబ్బలకు అడ్డుకట్ట



తుంబిగనూరులో ఇసుక దిబ్బలను పరిశీలిస్తున్న జీఐజెడ్ బృంద సభ్యులు

కణేకల్లు/బొమ్మనహాళ్: మొక్కలను విరివిగా పెంచడం ద్వారా ఇసుక దిబ్బల విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చని జీఐజెడ్ (ఎడారి నివారణకు కృషి చేస్తున్న అంతర్జాతీయ సంస్థ) నిపుణుల బృంద సభ్యులు హర్ష దోరియా (న్యూఢిల్లీ), ఓంప్రకాష్ పారిహార్ (రాజస్థాన్), స్టేట్ కో–ఆర్డినేటర్ సంతోష్ పేర్కొన్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని తుంబిగనూరు, గరుడచేడు, మీన్లహళ్లి, బిదరకుంతం, దర్గాహొన్నూరు గ్రామాల్లో వేదవతి హగరి నది ఒడ్డున వేలాది ఎకరాల్లో విస్తరించిన ఇసుక దిబ్బలను సోమవారం వారు పరిశీలించారు. ఇసుక దిబ్బలు మరింత విస్తరించకుండా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో చర్చించారు. ఈ భూముల్లో కర్జూరపు పంట సాగు సత్ఫలితాలను ఇస్తుందన్నారు. ఇసుక దిబ్బలు విస్తరించకుండా సరుగుడు, రేగు, గోరింటాకు చెట్లను నాటాలన్నారు. ఇసుకను వేరే ప్రాంతాలకు తరలించి, ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. దీనిపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కణేకల్లు, బొమ్మనహాళ్ ఏపీఓలు సుధాకర్, రమేష్, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ అందించండి


అనంతపురం: రెండు నెలల నుంచి పెన్షన్ అందడం లేదని ఎస్కేయూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. ఈ మేరకు సోమవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో పెన్షన్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెన్షన్ ఎప్పుడు వస్తుందో.. రాదో తెలియని అయోమయం నెలకొందన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ అన్ని వర్సిటీల్లోని రిటైర్డ్ ఉద్యోగులకు రూ.300 కోట్ల పెన్షన్ నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్ పూర్తయిన తరువాతే నిధులు వస్తాయని చెప్పారు. దీంతో మార్చి వరకు పెన్షన్ రాదని తెలియడంతో రిటైర్డ్ ఉద్యోగులు నిరాశగా వెళ్లిపోయారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూరి, కార్యదర్శి నాగన్న, నాయకులు ఆర్.కేశవ రెడ్డి, పెద్దిరెడ్డి, వెంకట్రాముడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మతిపోతోంది

- పెరుగుతున్న మానసిక రుగ్మతల బాధితులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 వేల మంది రోగులు
- లక్ష మంది ఏదో ఒక ఆందోళనతో సతమతమవుతున్నట్లు వెల్లడి
- ఇప్పటికే మధుమేహం, రక్తపోటుతో జనం ఇబ్బందులు
- ప్రతిబంధకాలుగా మారిన మొబైల్ ఫోన్‌లు

- అనంతపురం నగరంలో బీకాం చదువుతున్న ఓ యువకుడికి వారం రోజుల క్రితం మతి మరుపు సమస్య వచ్చింది. తల్లిదండ్రులు అతడిని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లగా.. తీవ్ర మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించారు. మొబైల్ ఫోన్‌కు బానిసై అన్నీ మరచిపోయాడని తెలిపారు.

- ఇటీవల గుంతకల్లుకు చెందిన ఓ యువతి మూడు దఫాలు ఆత్మహత్యాయత్నం చేసింది. వైద్యుడి వద్దకు ఆమెను తీసుకెళ్లగా.. మానసికంగా కుంగిపోయి ఉందని ఆయన తెలిపారు. చదువులో ఒత్తిడి భరించలేక ఇలా అయిందని చెప్పారు. వీరిద్దరే కాదు.. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఇటీవల భారీగా పెరిగింది.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత కొన్ని నెలలుగా వివిధ ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ హెల్త్ మిషన్) అధికారులు చేపట్టిన పరిశీలనలో 'మతి'పోయే విషయాలు వెల్లడయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా గత కొన్ని సంవత్సరాలుగా జబ్బులకు అడ్డాగా మారుతున్నట్టు తేలింది. ఇప్పటికే మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. తాజాగా మూడో యముడు అన్నట్టు మానసిక రుగ్మతలు తీవ్రంగా వేధిస్తున్నాయి. దశాబ్దం క్రితం వరకూ పట్టణాలకే పరిమితమైన మానసిక రుగ్మతలు పల్లెటూళ్లకూ పాకాయి. ఈ జబ్బు బారిన పడుతున్న వారు తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోతున్నారు.

15 వేల మంది బాధితులు..

బీపీ, మధుమేహం కంటే కూడా మానసిక రుగ్మతను అత్యంత ప్రమాదంగా పరిగణిస్తారు. అలాంటి తీవ్ర మానసిక రుగ్మత బాధితులు ఉమ్మడి జిల్లాలో 15 వేల మంది ఉన్నట్టు అంచనా. మరో లక్ష మంది వరకూ సాధారణ, మోస్తరు మానసిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభావం తక్కువగా ఉన్నప్పుడే కౌన్సెలింగ్ లేదా మందులు ఇప్పిస్తే తీవ్ర రుగ్మతగా మారే అవకాశం ఉండదు. కానీ బాధితులకు అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి ముదిరే వరకూ వైద్యులను సంప్రదించకపోవడం గమనార్హం.

15 వేల మందికి మందులే లేవు..

గతంలో 'వైఎస్సార్ ఆరోగ్య సురక్ష', ఏఎన్ఎంల ఇంటింటి సర్వే, 104 వాహనాల్లో పరీక్షలు తదితర కార్యక్రమాల వల్ల వ్యాధుల బాధితులను వేగంగా గుర్తించేవారు. ఇంటి వద్దే ఉచితంగా మందులిచ్చేవారు. అయితే, గత ఆరు మాసాల నుంచి మెంటల్ హెల్త్ పేషెంట్లకు ఒక్క మాత్ర కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని బాధితులు మందులు వాడక, జబ్బు ముదిరి పూర్తి మానసిక వైకల్యానికి గురవుతున్నారు.

రుగ్మతలకు కారణాలివే..

- మితిమీరిన ఒత్తిడి కారణంగా చాలామంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు.
- మొబైల్ ఫోన్‌లకు బానిస కావడంతో ప్రపంచమే అదే అనుకుని దాని మత్తులోకి వెళ్లిపోతున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో వస్తున్న రకరకాల రీల్స్, న్యూస్ చూస్తూ తమలో తామే ఊహించుకుని మానసికంగా కుంగిపోతున్నారు.
- కొంతమంది విద్యార్థులు చదువుల ఒత్తిడి కారణంగా డిప్రెషన్‌లోకి జారుకుంటున్నారు.
- రకరకాల బెట్టింగ్‌లు, ఆర్థిక కారణాలతో తీవ్ర మానసిక రోగానికి గురవుతున్నారు.
- ఇటీవల కాలంలో లోన్‌యాప్‌ల ఒత్తిళ్లతో మానసిక స్థైర్యం కోల్పోతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల మానసిక రుగ్మతల బాధితులు..

కేటగిరీ	బాధితులు
మొత్తం రోగులు	1.10 లక్షలు
స్క్రిజోఫినియా, బైపోలార్	10 శాతం
డ్రగ్, ఆల్కహాల్‌కు బానిసలై ఇబ్బంది పడుతున్న వారు	30 శాతం
డిప్రెషన్, యాంగ్జైటీ	40 శాతం
మొబైల్, చదువుల ఒత్తిళ్లు	10 శాతం

చాలా మందికి అవగాహన లేదు

వ్యాధి ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. కానీ చాలామందిలో అవగాహన లేక జబ్బు ముదిరే వరకూ జాగ్రత్త పడటం లేదు. ఆల్కహాల్, డ్రగ్స్‌కు బానిసలవుతూ మానసికంగా ఇబ్బంది పడుతున్న వారు ఇటీవల ఎక్కువయ్యారు. – డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, ఎన్‌హెచ్‌ఎం

పప్పుశనగ రైతులకు కుచ్చుటోపీ



ఎస్‌ఐ శివకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బెళుగుప్ప: పప్పుశనగ రైతులకు ఓ వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మల్లెమల విక్రమ్‌కు పలు గ్రామాలకు చెందిన రైతులు పంటల దిగుబడులు ఇచ్చేవారు. తగ్గుపర్తి వద్ద శివసాయి వేర్‌హౌస్‌కు దిగుబడులను విక్రమ్ తరలించేవాడు. అయితే గత ఏడాది గుట్టు చప్పుడు కాకుండా పప్పుశనగ నిల్వలను తెగనమ్మిన విక్రమ్.. రైతులకు డబ్బు మాత్రం చెల్లించలేదు. దీనిపై అడిగితే అదిగో ఇదిగో అంటూ రైతులను మభ్యపెట్టేవాడు. ఈ క్రమంలోనే బెళుగుప్ప నుంచి తొలుత బళ్లారికి మకాం మార్చాడు. ఇటీవల బళ్లారి నుంచి కూడా పరారయ్యాడు. పంట దిగుబడులు ఇచ్చిన రైతులకు కోర్టు నోటీసులను పంపాడు. దీంతో 30 మంది విక్రమ్ బాధిత రైతులు సోమవారం పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐ శివకు ఫిర్యాదు చేశారు. తమకు సుమారు రూ.5 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని వాపోయారు. వేర్‌హౌస్ వద్దకు వెళ్లి ఆరా తీస్తే విక్రమ్ తన వాటాను అమ్ముకుని వెళ్లాడని చెప్పారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ శివ మాట్లాడుతూ పూర్తిస్థాయి విచారణ చేపట్టి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

గవర్నర్‌తోనే అసత్యాలు చెప్పిస్తారా?

- గత ప్రభుత్వ మేలునూ 'కూటమి' ఖాతాలోకి వేస్తే ఎలా?
- సీఎం చంద్రబాబు తీరు దారుణం
- మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్, చిత్రంలో మాజీ ఎంపీ రంగయ్య, పార్టీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: 'గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు రూ.లక్షల కోట్ల సంక్షేమం అందింది. కానీ, నేటి కూటమి ప్రభుత్వం మాత్రం ఆ క్రెడిట్ తమదేనన్న చందంగా అసెంబ్లీ సాక్షిగా గవర్నర్‌తో అసత్యాలు చెప్పించడం ఎంత వరకూ సమంజసం' అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. సోమవారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబుకు పాలనపై పట్టు లేదని గవర్నర్‌తో చెప్పించి ఉంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక పేర్చలేదని, సెంటు భూమి కూడా ప్రజలకు పంచలేదని, అయినా 5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ సర్కార్‌లో రైతులకు అడుగడుగునా ప్రోత్సాహం లభిస్తే.. నేడు సీఎం చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కరెంటు చార్జీలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు 'సూపర్ సిక్స్'లో ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. శాంతి భద్రతల వైఫల్యంతో రాష్ట్రానికి ఒక్క రూపాయి పెట్టుబడులు రాలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బతికించాలని కోరారు. సీఎం చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలతో వైద్య రంగం నిర్వీర్యమైందన్నారు. పులివెందుల, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వైద్య కళాశాలలు వద్దని కూటమి సర్కారు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 15 వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలోకి తీసుకెళ్లాలని చూడటం దారుణమన్నారు. ఆరోగ్య శ్రీ పథకం లేకుండా చేయాలనే దుష్ట తలంపుతో బీమా సంస్థలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శాసనసభను హుందాగా నడిపించాల్సిన బాధ్యత సభా నాయకుడైన సీఎం చంద్రబాబుపై ఉందని శైలజానాథ్ పేర్కొన్నారు. కానీ, ప్రధాన ప్రతిపక్షాన్ని ఏర్పాటు చేసుకోకుండా సమావేశాల్లో సొంత డబ్బా కొట్టుకుంటూ ప్రజలను మభ్యపెట్టేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా కల్పించి, ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి జిల్లాకు మేలు చేసేలా మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపాలన్నారు.

ఇదేనా మంచి ప్రభుత్వమంటే..?

'సూపర్ సిక్స్'లో కనీసం ఒక్క హామీనైనా నెరవేర్చుతామని సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు చెప్పగలరా అని కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య సవాల్ విసిరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 96 శాతం పథకాలు అమలు చేశామన్నారు. కూటమి సర్కారు ఏర్పాటయ్యాక మంచి ప్రభుత్వమంటూ స్టిక్కర్లు వేసుకున్నారని, ఒక్క హామీని కూడా అమలు చేయని ప్రభుత్వం ఏవిధంగా మంచిదవుతుందని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అ'ధనం' వసూలు చేస్తే చర్యలు

- గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులకు జేసీ హెచ్చరిక

అనంతపురం అర్బన్: 'గ్యాస్ సిలిండర్ డెలివరీలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. పదేపదే చెబుతున్నా ఏజెన్సీల నిర్వాహకుల తీరు మారడం లేదు. ఇకపై ఉపేక్షించే ప్రసక్తి ఉండదు. అదనంగా వసూలు చేసే బాయ్స్‌తో పాటు గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ హెచ్చరించారు. 'దీపం' పథకం, సిలిండర్ల డెలివరీ తదితర అంశాలపై జేసీ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో సమీక్షించారు. పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖల అధికారులు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, గ్యాస్ డీలర్లు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ డెలివరీ విషయంలో వినియోగదారుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్నారు. పలుమార్లు హెచ్చరించినా మార్పు రావడం లేదన్నారు. ఇప్పటికీ డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తునట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలా వసూలు చేసే డెలివరీ బాయ్స్, సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్యాస్ ఏజెన్సీలపై తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో పురోగతి లేదని, మెరుగుపడకపోతే చర్యలుంటాయన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎస్ఓ జగన్‌మోహన్‌రావు, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు.. కొన్ని దారి మళ్లింపు

గుంతకల్లు: పెనుకొండ–మక్కాజీపల్లి మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–హిందూపురం ప్యాసింజర్ రైలు (77213)ను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు, హిందూపురం–గుంతకల్లు ప్యాసింజర్(77214)ను ఈ నెల 26 నుంచి 28 వరకు రద్దు చేశామన్నారు. బెంగళూరు–ధర్మవరం (06595/60) ప్యాసింజర్లు హిందూపురం–ధర్మవరం మధ్య ఈనెల 25 నుంచి 28 వరకు తిరగవని, కేవలం బెంగళూరు–హిందూపురం మధ్య రాకపోకలు సాగిస్తాయన్నారు. అహ్మదాబాద్–యశ్వంత్‌పూర్ (22689) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25న వయా ధర్మవరం–పెనుకొండ–హిందూపురం మీదుగా మళ్లించామన్నారు. కలబురిగి–బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22231)ను ఈ నెల 25 నుంచి 27 వరకు అనంతపురం, ధర్మవరం, పెనుకొండ,యలహంక మీదుగా, కాచిగూడ–యశ్వంత్‌పూర్ (20703)ను ఈ నెల 25 నుంచి 28 వరకు ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, పెనుకొండ మీదుగా,



హుబ్లీ–మైసూర్ (16591), కాచిగూడ–మైసూర్ (12785), నాందేడ్–బెంగళూరు (16594) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 26,27వ తేదీల్లో ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, పెనుకొండ మీదుగా మళ్లించనున్నట్లు వివరించారు. ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పేదోడి రైళ్లు మరో వారం తిరగవ్!

రాయలసీమ జిల్లాల మీదుగా రాకపోకలు సాగిస్తూ పేదోడి రైళ్లుగా పేరుగాంచిన పలు ప్యాసింజర్‌లు మరో వారం రోజులు తిరగవు. కుంభమేళాను పురస్కరించుకుని ఈ రైళ్లను ఫిబ్రవరి 28 వరకూ రద్దు చేశారు. తాజాగా మరో వారం పాటు పొడిగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి–కదిరిదేవరపల్లి (57406) ప్యాసింజర్ మార్చి 7 వరకు, కదిరిదేవరపల్లి–తిరుపతి (57405) ప్యాసింజర్ మార్చి 8 వరకు రాకపోకలు సాగించవన్నారు. అలాగే, గుంతకల్లు–తిరుపతి(57404)ప్యాసింజర్ మార్చి 7 వరకు, తిరుపతి–గుంతకల్లు (57403) రైలు మార్చి 8 వరకూ, తిరుపతి–హుబ్లీ (57402) మార్చి 7 వరకు, హుబ్లీ–తిరుపతి (57401) ప్యాసింజర్ మార్చి 8 వరకు తిరగవన్నారు.

చిన్న సమస్యలూ పెద్ద సార్ల వద్దకు!

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పోటెత్తిన అర్జీలు



- ఇతని పేరు వన్నూరుసాబ్. అనంతపురం నగర పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. కాలనీలో ఒక వ్యక్తి ఏర్పాటు చేసుకున్న బట్టీ కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వన్నూరుసాబ్ చెప్పాడు. బట్టీలోకి పాతటైర్లు, టెంకాయచిప్పలు, కుళ్లిన కొబ్బరి, చెత్తా చెదారం వేసి నిప్పు పెడుతుండటంతో పొగ వెలువడుతూ ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, తగిన పరిష్కారం చూపాలని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారులను వేడుకున్నాడు.

అనంతపురం అర్బన్: పంచాయతీ, మునిసిపల్, మండల స్థాయిల్లోనే పరిష్కారం కావాల్సిన చిన్న చిన్న సమస్యలకూ మోక్షం లభించ లేదు. దీంతో పెద్దసార్లకైనా విన్నవిస్తే పరిష్కారం దొరుకుతుందేమోననే గంపెడాశతో వ్యయ ప్రయాసలకోర్చి అర్జీదారులు తరలివచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో వివిధ సమస్యలపై 502 వినతులు అందాయి. ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జునలు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- మాజీ సైనికుల కోటా కింద బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ గ్రామ సర్వే నంబరు 114–ఏ1లో తనకు మంజూరైన ఐదెకరాల పొలానికి డీ పట్టా ఇవ్వడం లేదని పరమేశ్వరప్ప ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి న్యాయం చేయాలని వేడుకున్నాడు.
- విద్యాశాఖలో బోధనేతర విధులు నిర్వర్తిస్తున్న బోధన సిబ్బందిని తొలగించాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.ఉజ్వల్ విన్నవించాడు. పలువురు ఉపాధ్యాయులు చాలా సంవత్సరాలుగా డీఈఓ, సమగ్రశిక్ష తదితర కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారని, పాఠశాలల్లో వేతనం తీసుకుంటూ విద్యార్థులకు చదువు చెప్పడం లేదని, సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరాడు.
- కూడేరు మండలం కడదరకుంట సర్వే నంబరు 27–1లో ఎస్సీ వర్గానికి చెందిన కొక్క మారెప్పకు అసైన్డ్ చేసిన 10.99 ఎకరాలను ఓ వ్యక్తి చట్టవిరుద్ధంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న ఆధ్వర్యంలో బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఉరవకొండ మండలం వై.రామాపురం సర్వే నంబరు 341–డీలోని తన భూమి సర్వే కోసం గత నెల 23న చలానా కట్టానని, జిల్లా సర్వేయర్‌ను పంపించి సమస్య పరిష్కరించాలని పి.మాబు విజ్ఞప్తి చేశాడు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

క్లుప్తంగా

ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి

• జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ



పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ శివ్‌నారాయణ్‌శర్మ, అధికారులు

అనంతపురం అర్బన్: ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి సాధ్యమని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. ముఖ్య అవసరాలకు సంబంధించి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూపొందించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఆర్థిక అంశాలలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పుడు సమస్యలను సులభంగా అధిగమించవచ్చన్నారు. బాధ్యతాయుతంగా అప్పు చేయడమే కాకుండా సమయానికి చెల్లింపులూ ఉండాలన్నారు. నెలసరి బడ్జెట్‌ను ప్లాన్ చేసుకుని కొంత సొమ్మును పొదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఎల్‌డీఎం నర్సింగరావు, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



శశికుమార్

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు శశికుమార్ కనిపించడం లేదు. అదే గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శశికుమార్... ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆదివారం కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించారు. ఇంట్లో చెప్పి వెళ్లి ఉండాల్సిందని హితవు పలికారు. దీంతో మనస్తాపానికి గురైన శశికుమార్ అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడి కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి



గురుస్వామి (ఫైల్)

బ్రహ్మసముద్రం: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామానికి చెందిన రైతు గురుస్వామి (54)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల పొలంలో వరి సాగు చేపట్టిన ఆయన ఆదివారం రాత్రి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. చీకట్లో పాముకాటు వేయడంతో అక్కడే పడిపోయాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన పక్క పొలంలోని రైతులు వెంటనే కుటుంబసభ్యులతో కలసి గురుస్వామి రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పాము కాటుతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ బుసప్ప, పోలేపల్లి లోకేస్, మంజునాథ్, మహాలింగ, యల్లప్ప, శంరణప్ప, మంజు తదితరులు సోమవారం గురుస్వామి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

సూర్యోదయం.. వర్ణ శోభితం

ఎప్పుడు చూసినా ఆకాశం వింతగానే కనిపిస్తుంటుంది. అందులో ప్రతిఫలించే రంగులెన్నో మనసుకు ఉత్తేజాన్ని అందిస్తుంటాయి. ఇందుకు నిదర్శనమే సోమవారం నాటి సూర్యోదయం. ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు ఆకాశంలోని మబ్బులను చీల్చుకుంటూ పైకి వస్తున్న సూర్యుడి కిరణాలు అనంత సాగరం (చెరువు) నీటిలో సప్తవర్ణ శోభితమై ప్రతిబింబిస్తూ అనంతపురం నగర వాసులకు కనువిందు చేశాయి. సూర్యోదయాన్ని చూసిన పలువురు మైమరచిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కబ్జా కోరల్లో వక్ఫ్ ఆస్తులు

ఉమ్మడి జిల్లాలోని వందలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆస్తులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం.. ఏళ్లుగా ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్ర స్థాయిలో వాటి జాడను పసిగట్టడం కష్టమవుతోంది.

- రాయదుర్గంలో అన్యాక్రాంతమవుతున్న విలువైన భూములు
- ఇష్టారాజ్యంగా వెలసిన రేకుల షెడ్‌లు



రాయదుర్గంలోని వక్ఫ్ స్థలంలో అక్రమంగా వెలసిన దుకాణాలు



రాయదుర్గంలో కబ్జా చేసేందుకు స్థలాన్ని చదును చేసిన దృశ్యం

రాయదుర్గం: కబ్జా కోరల్లో చిక్కుకుని జిల్లాలోని వక్ఫ్ భూములు హరించుకుపోతున్నాయి. దాతలు ఇచ్చిన విలువైన ఆస్తులు పరాధీనమవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు వక్ఫ్ పరిధిలో 6 వేల ఎకరాలు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో చాలా వరకు భూములు, ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. వీటి విలువ రూ.కోట్లలోనే ఉంటుందని అంచనా.

అక్రమంగా వెలుస్తున్న వ్యాపార సముదాయాలు

జిల్లాలోని గుత్తి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 601, 603–బీ, 410, 414, 604,603–ఏ లోని రూ.కోట్లు విలువ చేసే వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. నిజామీ, షాదీఖానా, పాత హైవే తదితర ప్రాంతాల్లో వక్ఫ్ స్థలాలను లీజుకు తీసుకున్న వ్యక్తులు శాశ్వత భవనాలు, రేకుల షెడ్డులు నిర్మించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. పెనుకొండ రెవెన్యూ పరిధిలోనూ 14 ఎకరాల వక్ఫ్ భూముల్లో 44వ జాతీయ రహదారి విస్తరణకు పోను మిగిలిన భూముల్లో భారీ ఎత్తున వ్యాపార సముదాయాలు వెలిశాయి. రాయదుర్గం పట్టణంలోనూ సర్వే నంబర్ 232లో పెద్ద చావిడికి చెందిన 13 ఎకరాల వక్ఫ్ భూములపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఇరువర్గాల వారు భూమిపై హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. క్షేత్రస్థాయిలోని కొందరు రెవెన్యూ అధికారుల ప్రోద్బలంతో గతంలో అక్రమంగా కొన్ని రేకుల షెడ్లు వెలిశాయి. తాజాగా మరో వర్గం వారు తాము హక్కుదారులమంటూ షెడ్ల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వక్ఫ్ అధికారులు సకాలంలో ఆక్రమణలను అడ్డుకున్నారు. ఇప్పటికే ఆక్రమణకు గురైన స్థలాల్లో కొందరైతే విలాసవంతమైన షెడ్లు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

నాడు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు తీసుకున్నారు. మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో రీసర్వే ద్వారా గుర్తించిన ఆస్తులను కాపాడటంతో పాటు అన్యాక్రాంతమైన వాటిని ఆగమేఘాలపై స్వాధీనం చేసుకున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎనిమిది నెలలకే చాలా చోట్ల వక్ఫ్ భూములపై వివాదాలు తలెత్తుతున్నాయి. ఎంతో విలువైన భూములపై కబ్జా దారులు కన్నేశారు. వీరికి కొందరు వత్తాసు పలుకుతుండడంతో ఎక్కడికక్కడ వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి.

ఆక్రమణ దారులకు నోటీసులు

వక్ఫ్ పరిరక్షణ చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తులు కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ఎక్కడైనా ఆక్రమణదారుల కన్ను పడితే అడ్డుకుంటున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని గుత్తి, పెనుకొండ తదితర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకున్నాం. తాజాగా రాయదుర్గంలో కొందరు ఆక్రమించాలని చూస్తే రెవెన్యూ, పోలీసులకు నోటీసులు పెట్టి అడ్డుకున్నాం. ఈ స్థలం పూర్తిగా వక్ఫ్ ఆధీనంలోనే ఉంది. కొందరు కోర్టుకెళ్లారు. విచారణ సాగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. ఇందుకు మత పెద్దలు, అధికారులు సహకరించాలి.

– రహీమ్ ఉసేన్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం

కంకర క్రషింగ్ యూనిట్‌లో కార్మికుడి మృతి



సురేంద్ర (ఫైల్)

గుత్తి రూరల్: కంకర క్రషింగ్ యూనిట్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన మునగాల రాముడు కుమారుడు సురేంద్ర (31)కు భార్య ప్రమీల, కుమారుడు త్రివిక్రమ్ ఉన్నారు. జక్కలచెరువు గ్రామ శివారులోని శివసాయి కంకర క్రషర్ యూనిట్‌లో కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజు వారీ విధుల్లో భాగంగా సోమవారం ఉదయం క్రషర్ మిషన్‌లోకి పెద్ద పరిమాణంలో ఉన్న రాళ్లను వేస్తున్న సమయంలో ఉన్నఫళంగా రెండు రాళ్లు సురేంద్ర తలపై పడ్డాయి. వెనువెంటనే కిందపడిన సురేంద్రపై ఏకమొత్తంగా కంకర రాళ్లు మీదపడడంతో వాటి కింద కూరుకుపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే క్రషింగ్ యూనిట్‌ను ఆఫ్ చేసి కంకర రాళ్లను తొలగించారు. అచేతనంగా పడి ఉన్న సురేంద్రను వెంటనే ఆటోలో గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న భార్య, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలాన్ని గుత్తి ఎస్‌ఐ సురేష్ పరిశీలించి కేసు నమోదు చేశారు.

కార్మికుల భద్రత గాలికి

కంకర క్రషర్ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో యాజమాన్యం వైఫల్యం కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా పలువురు దినసరి కూలీలు ఆరోపించారు. క్రషర్ యూనిట్‌లో పని చేసే కార్మికుల తలకు హెల్మెట్, మోకాళ్ల వరకూ రక్షణగా ఉండే బూట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే అలాంటివేవి అక్కడ లేవు. చిన్నపాటి గాయాలైతే ప్రథమ చికిత్స చేసే కిట్లు కూడా క్రషర్‌లలో ఉంచుకోవడం లేదు. సోమవారం జరిగిన ప్రమాదంలో సురేంద్ర హెల్మెట్ ధరించి ఉంటే రాళ్లు తలపై పడినా బతికేవాడని కార్మికులు అంటున్నారు.

ఏపీ రైతు సంఘం నేత బడా సుబ్బిరెడ్డి కన్నుమూత



నివాళులర్పిస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి (ఇన్‌సెట్‌లో) బడా సుబ్బిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దక్షిణ జిల్లా కార్యదర్శి, సీపీఎం నాయకులు బడా సుబ్బిరెడ్డి(65) ఆదివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి ఆయన కన్నుమూశారు. కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆయన సుదీర్ఘకాలంగా రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించారు. సోమవారం ఉదయం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నేత ఓబులు తదితరులు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, అత్తార్ చాంద్ బాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, వ్యకాసం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు, నాయకులు జగన్, సాంబశివ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బాబ్జాన్‌తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు... సుబ్బిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతాంగ సమస్యలపై ఆయన సాగించిన అలుపెరగని పోరాటాలను ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరిగిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

వెల్డన్ రమేష్..



రమేష్‌గౌడ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. ఇటీవల వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ – లండన్ సంస్థ ద్వారా ఇంటర్నేషనల్ అవార్డును దుబాయిలో ఆయన అందుకున్న విషయం తెలిసిందే. దీంతో తనకు దక్కిన అవార్డును, జ్ఞాపికను సోమవారం విజయవాడలో వైఎస్ జగన్‌కు ఆయన చూపించారు. దీనిపై స్పందించిన వైఎస్ జగన్.. 'వెల్డన్ రమేష్... ఇదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో మరింతగా పని చేయండి' అంటూ అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బెళుగుప్ప: మండలంలోని ఓ గిరిజన తండాకు మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో యువకుడు తిప్పేస్వామినాయక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్‌ఐ శివ తెలిపారు. రాయదుర్గం మండలం రాతిబావివంక తండా గ్రామానికి చెందిన తిప్పేస్వామినాయక్ బెళుగుప్ప మండలంలోని ఓ తండాకు చెందిన మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి బాధిత బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

• ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ



కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) డివిజనల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పటి వరకు డీవీఎంగా ఉన్న చంద్రమౌళీశ్వర్ రెడ్డిని ఏపీటీడీసీ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. సోమవారం కర్నూలులోని వెంకటరమణ కాలనీలో ఉన్న టూరిజం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగు పరిచి సందర్శకుల సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపడతామన్నారు. నూతన డీవీఎంకు ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ షా వలీఖాన్, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, ఆర్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగనాయకులు, ఏపీటీడీసీ కర్నూలు యూనిట్ మేనేజర్ సతీష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వైష్ణవిశ్రీకి ఉమ్మడిశెట్టి పురస్కారం



వైష్ణవిశ్రీ

అనంతపురం కల్చరల్: ప్రతిష్టాత్మక వ్యక్తులకందించే ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ పురస్కారం ఈ ఏడాదికి గాను ప్రగతిశీల దృక్పథం కలిగిన కవయిత్రి వైష్ణవిశ్రీకి దక్కింది. ఈ మేరకు నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ రాధేయ సోమవారం తెలిపారు. ఉపాధ్యాయురాలిగా, సీనియర్ జర్నలిస్టుగా వైష్ణవిశ్రీ రాసిన 'రెండు ప్రపంచాల మధ్య' కవితా సంపుటి పురస్కారానికి ఎంపికైంది. న్యాయనిర్ణేతలుగా ఆచార్య మేడిపల్లి రవికుమార్, కవి సీతారాం, అద్దేపల్లి ప్రభు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ నుంచి శంకర్‌నాయక్ బహిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌పై ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ మేరకు సోమవారం శంకర్ నాయక్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది.

హేమావతి క్షేత్రంలో రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

అమరాపురం: దక్షిణ భారతదేశంలోనే అత్యంత పురాతన శైవక్షేత్రంగా ఖ్యాతిగాంచిన అమరాపురం మండలం హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామస్తుల సహకారంతో దేవదాయ శాఖ అధికారులు పూర్తి చేశారు. ఉత్సవాల షెడ్యూల్‌ను దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 26న బుధవారం మహాశివరాత్రి అఖండ పూజలు, రుద్రాభిషేకం, భజనలు, 27న గురువారం భాను పల్లకి, ధూళోత్సవం, అన్నసంతర్పణ, 28న శుక్రవారం అగ్నిగుండం, ముత్యాలపల్లకి ఉత్సవం, వివిధ రకాల పూలమాలలతో స్వామి మూలవిరాట్‌కు అలంకరణ, మార్చి 1న శనివారం సాయంత్రం సిడిమాను ఉత్సవం, అన్నసంతర్పణ, రాత్రికి ముత్యాలపల్లకి ఉత్సవం, 2న ఆదివారం సిద్ధేశ్వరస్వామి చిన్నరథోత్సవం, రాత్రి ముత్యాల పల్లకి ఉత్సవం, 3న సోమవారం బ్రహ్మరథోత్సవం, అన్నసంతర్పణ, 4న మంగళవారం వసంతోత్సవం, 5న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

జాతీయ స్థాయికి ఏపీఎంఎస్ విద్యార్థుల 'ఆవిష్కరణ'



జాతీయ స్థాయికి ఎంపికైన ఆవిష్కరణను చూపుతున్న ఏపీఎంఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: పాఠశాల విద్యార్థులను భవిష్యత్తులో ఆవిష్కర్తలుగా, వ్యవస్థాపకులుగా మార్చడంలో భాగంగా ఏర్పాటు చేసిన 'మేడ్ ఇన్ 3డీ – సీడ్ ది ఫ్యూచర్ ఎంటర్‌ప్రెన్యూర్స్'కు ధర్మవరంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక సమస్యలు గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు చూపించే ప్రయత్నం చూపి తమ ప్రతిభను చాటిన విద్యార్థులను డీఈఓ కృష్ణప్ప సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో వంద పాఠశాలల విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో 5 ఆవిష్కరణలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. వీటిలో చేనేత వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపుతూ ధర్మవరం ఏపీమోడల్ స్కూల్ గైడ్ టీచర్ శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులు సుజయ్, హేమంత్‌కుమార్, లాస్య, జ్యోతి, గుణశ్రీ, మేఘన రూపుదిద్దుకున్న ఆవిష్కరణ ఉండడం విశేషం.

గుండె సంబంధిత సమస్యతో విద్యార్థిని మృతి



వర్ష (ఫైల్)

సోమందేపల్లి: గుండె సంబంధిత సమస్యతో ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు... సోమందేపల్లికి చెందిన పురుషోత్తం కుమార్తె వర్ష (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఐదు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ధర్మవరం, అనంతపురంలోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించిక ఆదివారం రాత్రి బాలిక మృతిచెందింది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ వర్ష మృతి చెందినట్లు చికిత్స అందజేసిన కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. ఏకైక కుమార్తె మృతితో తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది. సోమవారం సాయంత్రం చిన్నారి అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించారు.

రైతు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

బుక్కరాయసముద్రం: రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రధాన మంత్రి కృషి సమ్మాన్ 19వ విడత నిధుల మంజూరు కార్యక్రమాన్ని బీకేఎస్ మండలం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున రూ.20 వేల కోట్లను కేంద్రం జమ చేస్తోందన్నారు. వ్యవసాయంతో పాటు ఆవులు, గొర్రెలు, కోళ్ల పెంపకాన్ని చేపట్టాలని రైతులకు సూచించారు. నిరంతరం పంట సాగులో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలని శాస్త్రవేత్తలను కోరారు. ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలువురు రైతులకు బెస్ట్ ఫార్మర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, డీహెచ్‌ఓ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఆత్మా పీడీ మద్దిలేటి, రెడ్డిపల్లి ప్రధాన శాస్త్రవేత్త భార్గవి, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర, సర్పంచ్ నరసమ్మ, శాస్త్రవేత్తలు సుధారాణి, శశికళ, డాక్టర్ మాధవి, చందన, శశికళ, కిషోర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చోటా మద్యం.. పడిపోమా మేం!

'తాగుతాం... ఎక్కడ పడితే అక్కడ పడిపోతాం' అంటున్నారు మందుబాబులు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైన్ షాపు వద్దే పూటుగా మద్యం సేవించేలా ఏర్పాట్లు ఉండటంతో ఫుల్లుగా తాగేస్తున్నారు. రోడ్లపైనే చిందులేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారు. దారినపోయే వారు అయ్యో పాపం అంటూ లేపబోతే వారినే నానా బూతులు తిడుతున్నారు. అలా పీకలదాకా తాగిన ఓ మందుబాబు సోమవారం అనంతపురంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని అన్నా క్యాంటీన్ సమీపంలో రోడ్డుపైనే పడిపోయాడు. నిత్యం విద్యార్థులు, ప్రయాణికులతో రద్దీగా ఉండే రోడ్డులో మందుబాబు చేష్టలతో అందరూ ఇబ్బంది పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మద్యం తాగి అనంతపురంలోని అన్న క్యాంటీన్ వద్ద పడిపోయిన వ్యక్తి

క్లుప్తంగా

అంగన్‌వాడీల సమగ్రాభివృద్ధే లక్ష్యం



సూచనలిస్తున్న ప్రథమ్ జిల్లా కో-ఆర్డినేటర్ రామ్మోహన్

ఆత్మకూరు: అంగన్‌వాడీల సమగ్రాభివృద్ధే లక్ష్యమని ప్రథమ్ జిల్లా కో–ఆర్డినేటర్ రామ్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు జరిగాయి. అంగన్‌వాడీల్లో రిజిస్టర్లు ఎలా నిర్వహించాలి? పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారు? మూల్యాంకరణ ఎలా చేయాలి తదితర విషయాలను వివరించారు. స్కూల్ కిట్లను ఎలా ఉపయోగించాలో తెలిపారు. అంగన్‌వాడీల్లో విద్యా ప్రణాళికను అమలు చేయడంతో పాటు సామర్థ్యాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



చంద్రను సన్మానిస్తున్న తరిమెల అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: ఎవరి స్వార్థంతో వారు బతుకుతున్న ప్రస్తుత సమాజానికి సాటి మనిషి గురించి ఆలోచించే యువత కావాలని మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్, సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు కార్యాలయంలో చంద్రయాన్ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. తరిమెల అమరనాథరెడ్డి, కో–కన్వీనర్ సలీంమాలిక్, లాల్‌బాషా తదితరులు మాట్లాడుతూ.. దేశభవిష్యత్తు ఆందోళనగా మారిందన్నారు. అనంత యువకులందరూ కలిసి ఐక్యమత్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఎదుటి మనిషి అవసరాన్ని తీర్చే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మమత సంస్థ కన్వీనర్ నవీన్‌కుమార్, శివ, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ప్రస్తుతం గ్రామాల్లో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులు నాణ్యతగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, మండల పంచాయతీ రాజ్ ఇంజినీర్ పార్థసారథి కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం మండలంలో వేస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఎంత మేరకు సిమెంట్, కంకర, ఇసుక వేస్తున్నారని ఆరా తీశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు వేసిన తరువాత నీరు సక్రమంగా పెట్టాలని సూచించారు. అనంతరం ఇంటింటా తిరిగి పీ–4 సర్వే నిర్వహించారు.

సన్మానం



బద్రీనాథ్‌ను సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ బద్రీనాథ్‌ను సోమవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి సన్మానించారు. ఇటీవల విడుదలైన ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్‌లో 99.99 పర్సంటైల్ సాధించిన నారాయణ విద్యా సంస్థల విద్యార్థి రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచాడు. అలాగే పలువురు విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారని నగరానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, మాచర్ల రాజు, రాధిక, ఎర్రిస్వామి, గంగాధర్ పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమించిన నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ బద్రీనాథ్‌ను సన్మానించినట్లు తెలిపారు.

ఎంబీఏ విద్యార్థినులకు అభినందన

అనంతపురం: నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో జేఎన్‌టీయూ అనంతపురం ఎంబీఏ విద్యార్థినులకు పాల్గొనే అవకాశం దక్కింది. ఈ ప్రోగ్రామ్ కింద ఎంపికైన సీఆర్ జాహ్నవి (ఎంబీఏ రెండో సంవత్సరం), పి.శ్రీనిధిని (ఎంబీఏ మొదటి సంవత్సరం) జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి, విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబు

- జాగరణకు విరూపాక్షేశ్వరాలయంలో ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాలు సుందరంగా ముస్తాబువుతున్నాయి. జిల్లా కేంద్రంలోని అతి పురాతన, మహిమాన్వితమైన (ప్రాచీన శివాలయం) విరూపాక్షేశ్వరాలయంలో ఇప్పటికే ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక పాతూరులోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా



అలంకరణలో విరుపాక్షేశ్వరుడు

ఆకట్టుకునే శిల్ప కళా వైభవం

పురాణ హంపీ కట్టడాలను పోలిన ఈ ప్రాచీన దేవాలయంలో అడుగు పెట్టగానే శిల్ప కళ మనల్ని ఇట్టే కట్టిపడేస్తుంది. గర్భగుడిలోని విరూపాక్షేశ్వరుడు, పక్కనే నిర్మాణమైన పార్వతి, గణేష విగ్రహాలు, నవగ్రహాలు, నరసింహ స్వామి, ఆంజనేయుడు.. ఇలా ప్రతి ఒకటి హంపీ శిల్పకళను పోలి ఉంటాయి. ఒకనాడు దీనికి వందల ఎకరాల దేవుడి మాన్యం ఉన్నట్టు శాసనాల ద్వారా తెలుసుకోవచ్చు. అయితే కాలక్రమంలో చాలా కబ్జాకు గురయ్యాయి. ప్రస్తుతం అలనాటి సిరిసంపదలు లేకున్నా అత్యంత మహిమాన్వితమైనదిగా పూజలందుకుంటోంది. అలాగే గుడికి సంబంధించిన ధ్వజ స్తంభాన్ని ఎదురుగా ఉన్న పోలీసు స్టేషన్‌లో చూడొచ్చు. ఈ ధ్వజ స్తంభం నిత్యపూజలందుకుంటోంది. పూర్తిగా హంపీలోని విరుపాక్షేశ్వరాలయంలో ప్రతి ఉత్సవం ఇక్కడ కనుల పండువగా జరుగుతుంది.



విరుపాక్షేశ్వర ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభం, మర్రిచెట్టు

ఓ మూలకు నక్కినట్టుండే ఈ ఆలయం విజయనగరాజుల కాలంలో నిర్మించబడింది. విశేష పూజలు, శివరాత్రి జాగరణకు ప్రస్తుతం ఆలయం సర్వాంగ శోభితంగా ముస్తాబైంది. మహాశివరాత్రికి ప్రత్యేక పూజోత్సవాలు, విశేషంగా ఏకవార రుద్రాభిషేకాలు, జాగరణ పండుగ జరుగుతాయని అర్చకులు ప్రసాద్ శర్మ, నిఖిల్ నారాయణ తెలిపారు.

ఇదీ.. ఆలయ విశిష్టత..

ఇంకా చెక్కు చెదరని నిర్మాణం నాటి ఘనమైన చరిత్రకు దర్పణం పడుతూ ఈనాటికీ భక్తుల్లో ఆధ్యాత్మిక భావ సంపదను నింపుతోంది. నాటి చక్రవర్తులలో తొలి తరం వారైన హరిహర బుక్కరాయల కాలంలో ఈ శివాలయం నిర్మించినట్టు ఆలయ చరిత్ర చెబుతోంది.

అనంత సాగరమే.. నేటి అనంతపురం

కరువు కాటకాలను ఎదుర్కోవడానికి బుక్కరాయల పేరు మీద 'బుక్కరాయ సముద్రం' అని.. ఒక చెరువు మంత్రి భార్య అనంతమ్మ పేరు మీద 'అనంత సాగరం' అని మరో చెరువు తవ్వించారు.



పాతూరు విరుపాక్షేశ్వర ఆలయం

నీటి కోసం వచ్చిన జనం స్థిరపడి పోయినందున బుక్కరాయసముద్రం, అనంత సాగరం అనేవి చెరువులుగానే గాక గ్రామాలుగా రూపాంతరం చెందినట్లు సమాచారం. ఆ అనంత సాగరమే నేటి 'అనంతపురం'గా మారిందనేది చరిత్ర చెప్పే సత్యం. గ్రామస్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించి.. నిత్య ప్రార్థనల కోసం 1,480లో విజయనగర రాజులు ఒక శివాలయాన్ని కట్టించారు. అదే నేడు ప్రాచీన ఓబులదేవర విరూపాక్షేశ్వరాలయం. హంపీ సామ్రాజ్య స్థాపకుల్లో ఒకరైన విద్యారణ్య స్వామి ఆదేశాలతో ఒకే ముహూర్తంలో హంపీ నగరం, బుక్కరాయ సముద్రం, నాటి అనంత సాగరంలో విరూపాక్షేశ్వరాలయాలను నిర్మించారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: శివాలయాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని మేయర్ వసీం అన్నారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయాన్ని సోమవారం సందర్శించారు. శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణ, లైటింగ్, తాగునీటితో పాటూ ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్ భూషణ్, ఎంహెచ్‌వో విష్ణుమూర్తి, ఆలయ ఈవో రమేష్‌బాబు, భక్తబృందం సభ్యులు నరేంద్ర చౌదరి, రాజు, స్వామి, రామచంద్ర, దాదా ఖలందర్, శీనా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆస్తి నష్టం



కాలిపోయిన సామగ్రిని చూపిస్తున్న మహిళ

కనగానపల్లి: మండలంలోని సీఎస్ కోట గ్రామానికి చెందిన చిన్నయ్య ఇంట్లో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని సామగ్రి, వంట సరుకులు, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. రూ.లక్ష దాకా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

అనంతపురం కార్పొరేషన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నగరపాలక సంస్థ ముందు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21 వేలు వేతనాలు పెంచాలని కోరారు. స్కూల్ స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు కనీస వేతనం రూ.15,000 ఇవ్వాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పని చేసేందుకు పనిముట్లు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ఒకటే వేతనం అమలు చేయాలన్నారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రసంగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, కార్యదర్శి రాజేష్‌గౌడ్, నాయకులు కృష్ణుడు, చిరంజీవి, వేణుగోపాల్, నాగేంద్రబాబు, శివకృష్ణ, దేవమ్మ, ఎర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

రాయలసీమకు కృష్ణా జలాలే ఆధారం

అనంతపురం అర్బన్: రాయలసీమ ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 ఏళ్ల వయస్సు పైబడిన రైతులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ రైతులు తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎకరాకూ నీరిస్తామంటూ ఎన్నికల ముందు హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చిన తరువాత సీమ ప్రజలకు అన్యాయం చేయడం పరిపాటిగా మారిందన్నారు. రాయలసీమకు నీరు ఇస్తామని చెప్పి, ఇతర ప్రాంతాలకు అందించే కుట్రలు జరుగుతున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాయలసీమ ప్రజలకు కృష్ణా జలాలే ఆధారమన్నారు.

మిర్చికి రూ.25 వేలు ఇవ్వాలి

గత ఏడాది మిర్చి క్వింటా రూ.25 వేల ధర పలికిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తామని చెబుతూ.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రూ.11,500 ప్రకారం కొనుగోలు చేయిస్తామని చెప్పడం సరికాదని మండిపడ్డారు. గత ఏడాది మాదిరిగా రూ.25 వేలు ఇవ్వాలన్నారు. ఇదే డిమాండ్‌పై మార్చి 3న చలో మిర్చి యార్డ్ చేపట్టనున్నామన్నారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, నీలపాల రామకృష్ణ, రామాంజనేయులు, శ్రీకాంత్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున

ముస్లింలకు సౌకర్యాలు కల్పించండి

అనంతపురం కల్చరల్: రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న సందర్భంగా ముస్లింలకు సౌకర్యాలు కల్పించాలని ఎంఎండీ (ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్) అధ్యక్షుడు ఇమామ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మలోలాకు ఎంఎండీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 2 నుంచి పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదుల వద్ద పారిశుధ్య పనులు, విద్యుత్, నీటి సమస్యలు, ఉద్యోగులు ఉపవాస దీక్ష విరమించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

కైలాస వాహనంపై ఆదిదంపతుల వైభవం



శివుడికి షెడ్డు ఏర్పాటు చేసిన భక్తులు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కనమనీయంగా సాగుతున్నాయి. సోమవారం భక్తులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వాహన సేవల్లో భాగంగా సర్వాంగ సుందరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను కైలాస వాహనంపై ఊరేగించారు. అంతకు ముందు ఆలయంలో సరస్వతీ హోమం, దీక్షా హోమం, మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయం ముందు తపస్సు చేసుకుంటున్న భంగిమలో నిర్మించిన మహాశివుడికి ఆదిశేషయ్య అనే భక్తుడి కుటుంబ సభ్యులు రూ.80 వేలు విలువ చేసే షెడ్డును సోమవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమేష్‌బాబు, ఇతర భక్తులు వారిని ఘనంగా సత్కరించారు. అలాగే ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రహ్మణ్యం 27 రుద్రాక్షమాలలు, 27 స్ఫటిక మాలలను అందజేశారు.



కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాక్షమాలల సమర్పణ

డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని ధర్నా

అనంతపురం అర్బన్: ఎస్సీ ఏకసభ్య కమిషన్ సమావేశంలో ఆన్‌లైన్ జూదం ఆడిన డీఆర్‌ఓపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. ఒక ముఖ్యమైన సమావేశం జరుగుతున్న సమయంలో డీఆర్‌ఓ వ్యవహరించిన తీరు బాధ్యతరహితం అన్నారు. తన పక్కన ఉన్నతాధికారులు ఉండగానే ఆన్‌లైన్‌లో జూదం ఆడుతూ కాలక్షేపం చేయడం సరికాదని తెలిపారు. ఉన్నతాధికారులు డీఆర్‌ఓపై విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపించి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఆయనపై శాఖా పరచర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు కేపీరాజు, సుగామంచి శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, మద్దెలచెరువు మల్లి, కావేటి ఉమామహేశ్వరి, అంజి, మల్లి, హరినాథ్‌రెడ్డి, షఫి, మల్లికార్జున, చెలిమప్ప, రామకృష్ణ, నాగేంద్ర, వెంకటేష్, బాబు, గోపాల్, బాలు, సూరి పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కనగానపల్లి: పేద ప్రజలకు ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఐ మండల నాయకులు అధికారులను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క పేద కుటుంబానికి కూడా రేషన్‌కార్డు మంజూరు చేయలేదన్నారు. మండలంలో చాలా మంది పేదలు రేషన్‌కార్డులు లేనివారు ఉన్నారని తెలిపారు. వారికి వెంటనే కార్డులు మంజూరు చేసి రేషన్‌సరుకులు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, నాయకులు మల్లికార్జున, మంజునాథ్ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

అనంతపురం అర్బన్: నగర పరిధిలో ఏళ్లుగా నివాసముంటున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్‌సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగన్న మట్లాడుతూ.. నగరంలో చాలా మంది నిరుపేదలు కూలీ పనులు చేసుకుంటూ బాడుగ ఇళ్లలో జీనవం సాగిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వారికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలోని వారికి 2 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాలని తెలిపారు. పక్కా గృహాలు నిర్మించి ఆదుకోవాలన్నారు. జీఓ 319 ప్రకారం అర్హులైన పేదలకు ఒక్కొక్కరికి 2.50 ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ ఆలం, ప్రతిభా భారతి, శేషు, ఆది, శ్రీరాములు, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ఘనంగా ఎర్రితాత, పక్కీరప్ప రథోత్సవం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ పంచాయతీ పరిధిలో ఉన్న పెన్నప్పగుడి వద్ద సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎర్రితాత, పక్కీరప్ప రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కృష్ణ ఆధ్వర్యంలో ఎర్రితాత, పక్కీరప్ప స్వాములను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25, 26న న్యూకేటగిరి, ఆరుపళ్ల విభాగపు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. న్యూకేటగిరి విభాగపు విజేత వృషభాలకు రూ.50వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేల చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే ఆరుపళ్ళ విభాగపు పోటీ విజేత వృషభరాజులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5 వేలు, రూ.4వేలు, రూ.3వేలలు చొప్పున నగదు బహుమతులు అందజేయబడతాయన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహిస్తామన్నారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో వారం రోజుల క్రితం నరసప్ప (68) అనే వృద్ధుడు చింతచెట్టు పై నుంచి పడిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన అతడ్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: మాఘమాసం నాలుగో ఆదివారం అశ్వత్థం తిరునాల సందర్భంగా భక్తుల నుంచి హుండీల ద్వారా వచ్చిన ముడుపులు, కానుకలను సోమవారం దేవదాయశాఖ స్పెషలాఫీసర్ వన్నూరు స్వామి, ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.6,63,981, పర్మినెంటు హుండీల ద్వారా రూ.3,64,084, దర్శనం టికెట్ల ద్వారా రూ.1,92,050, తలనీలాల టికెట్ల ద్వారా రూ.24,850, విరాళాల రూపంలో రూ.24,732. అభిషేకం టికెట్ల ద్వారా రూ.500 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం

కూడేరు: భూ సమస్యలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తామని ట్రైనీ కలెక్టర్ వినూత్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు సమస్యలపై వినతులు అందించారు. స్పందించిన ట్రైనీ కలెక్టర్ .. సంబంధిత అధికారులను పిలిచి భూ సమస్యల రికార్డులు సిద్ధం చేయాలని, తానే ఫీల్డ్‌కు వెళ్లి రికార్డుల మేరకు భూమిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ సూర్యప్రతాప్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ రమణయ్య, ఏఎస్ఐ రామానాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, ఏసీడీపీఓ ఎల్లమ్మ, అధికారులు పాల్గొన్నారు.



భూసమస్యలు వింటున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న